ఈనాడు
వనపర్తి
గురువారం అక్టోబరు 3, 2024
7

గాంధీ కల సాకారం చేద్దాం: కలెక్టర్



గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శసురభి, కార్యాలయ సిబ్బంది

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న స్వచ్ఛభారత్‌ను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఆదర్శసురభి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గాంధీ జయంతి జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో సమాజం ఆర్థికంగా, వ్యవసాయపరంగా, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని గాంధీ ఆశించారన్నారు. ప్రశ్నించడానికి భయపడే నాటి సమాజంలో అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చి శాంతియుతంగా అహింసా మార్గంలో నడిపించి బ్రిటీష్ వారిలో వణుకు పుట్టించిన బాపూజీ గురించి కొనియాడారు. అనంతరం డా. కేవీఆర్ వీరయ్య రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, పలువురు జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందినుద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ గిరిధర్

ప్రపంచానికి మార్గదర్శకం..


వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: భారతావనికి స్వేచ్ఛా స్వాతంత్ర్యం అందించేందుకు గాంధీజీ ఎంచుకున్న శాంతి, అహింస మార్గం భారతీయులకే కాదు యావత్ ప్రపంచానికి మార్గదర్శకమని ఎస్పీ గిరిధర్ అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ కృష్ణకిశోర్, ఆర్ఐలు శ్రీనివాస్, అప్పలనాయుడు, ఎస్బీ ఎస్సై శివకుమార్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండలు.. గుట్టలు.. మాయం!

అభివృద్ధి పేరుతో యథేచ్ఛగా తవ్వకాలు

ఈనాడు, మహబూబ్‌నగర్ - న్యూస్‌టుడే, ధరూర్: పాలమూరులో జాతీయ రహదారుల నిర్మాణం మాటున ప్రకృతి సంపద మాయం అవుతోంది. ఆయా జిల్లాల్లో రోడ్ల నిర్మాణం జరిగే పరిసర ప్రాంతాల్లో కొండలు, మట్టి గుట్టలు ఆనవాళ్లు లేకుండాపోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు. మొరం, క్వారీ తవ్వకాలకు తహసీల్దార్ నుంచి ఎన్‌వోసీ తీసుకుని ఆ లేఖను గనులశాఖకు ఇవ్వాలి. సర్వేయర్ వచ్చి అక్కడ మైనింగ్‌కి అవకాశం ఉందా? లేదా? ఎంత మేర తవ్వాలి? ఎంత మేర తరలించాలి? సీనరేజీ ఛార్జీలు ఎంత చెల్లించాలి? వంటివి పరిశీలించి అనుమతులిస్తారు. ఉమ్మడి జిల్లాలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి రూ.కోట్లలో సీనరేజి ఛార్జీల్లోనూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎన్‌హెచ్150సి: గద్వాల జిల్లా నందిన్నె నుంచి ఏపీలోని నంద్యాల వరకు (77 కిలోమీటర్లు)
మొత్తం విలువ: రూ.1,568 కోట్లు
మట్టి పని విలువ: సుమారు రూ.470 కోట్లు



శాంతినగర్‌లో మొరం కోసం ఇలా..

జరిమానా విధించినా.. : ● మొరం టన్నుకు రూ.35, రాళ్లకు టన్నుకు రూ.80 వరకు సీనరేజీ ఛార్జీలు మైనింగ్ శాఖకు చెల్లించాలి. గతేడాది గద్వాల జిల్లాలో అక్రమ తవ్వకాలు జరిపినందుకు గనులశాఖ జరిమానా విధించింది. ప్రభుత్వానికి రూ.4.95 కోట్లు సీనరేజీ ఛార్జీలు, రూ.1.48కోట్లు జిల్లా మినరల్ ఫండ్, రాష్ట్ర మినరల్ ఫండ్ రూ.9.90 లక్షలు, ఆదాయం పన్ను రూ.9 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. అయినా గుత్తేదారు సంస్థ స్పందించకపోవడంతో 10 రెట్ల జరిమానాతో రూ.52 కోట్లు చెల్లించాలని డిమాండ్ నోటీసులు అందించారు. తాజాగా గట్టు మండలంలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతున్న పలుగురాళ్లపై రూ.4 కోట్ల వరకు జరిమానా విధించింది.

● మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని జాతీయ రహదారి పేరుతో హన్వాడ, మహ్మదాబాద్, గండీడ్‌లో మొరం మట్టి, కంకర కోసం పెద్ద ఎత్తున గుట్టల్ని ధ్వంసం చేస్తున్నారు. గుట్టల వద్ద శిబిరాలు ఏర్పాటు చేసుకుని మరీ తవ్వుతున్నారు. జిల్లాలో మైనింగ్ శాఖ ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో యథేచ్ఛగా సంపదను కొల్లగొట్టేస్తున్నారు. సీనరేజీ ఛార్జీలు నేరుగా తమ ఖాతాలో జమవుతున్నాయని జిల్లా అధికారులు పట్టించుకోపోవడంతో సుమారు రూ.10 కోట్ల విలువైన మొరం, కంకర, పలుగురాళ్ల వ్యాపారం చేపట్టినట్లు సమాచారం.



ఊర్కొండపేటలో కరుగుతున్న గుట్ట

ఎన్‌హెచ్-167ఎన్: మహబూబ్‌నగర్-చించోళి వరకు (60 కిలోమీటర్లు)
మొత్తం విలువ: రూ.703.68 కోట్లు
మట్టి పని విలువ: సుమారు రూ.211 కోట్లు



గండీడ్ మండలం గోవింద్‌పల్లిలో తవ్వకాలు

గ్రామాలకు అందని డబ్బు..: సీనరేజీ ఛార్జీల రూపంలో ప్రభుత్వ ఖజానాకు వచ్చిన నిధుల్లో 25 శాతం గ్రామ పంచాయతీలకు, మండల, జిల్లా పరిషత్తులకు 50 శాతం కేటాయించాలని కేంద్ర నిబంధనలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇది ఎక్కడా అమలు కావడం లేదు. ఉమ్మడి జిల్లాలో మూడు జాతీయ ప్రాజెక్టులకు కలిపి సుమారు రూ.150 కోట్ల వరకు సీనరేజీ ఛార్జీల రూపంలో చెల్లించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కటే ఖాతా ఉండటంతో అన్నీ అందులోనే జమవుతున్నాయి. అసలు సీనరేజీ ఛార్జీలు వస్తున్నాయో? లేదో? కూడా గనులశాఖకు అవగాహన ఉండడం లేదు. దీనిపై మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాల మైనింగ్ శాఖ అధికారులు 'ఈనాడు'తో మాట్లాడుతూ అనుమతులున్న చోటే తవ్వకాలు జరపాలని చెప్పారు. ఇష్టారాజ్యంగా తవ్వితే జరిమానా విధిస్తామన్నారు. జాతీయ రహదారి డీఈ రమేశ్ మాట్లాడుతూ రహదారుల పనుల్లో మొరం, కంకర కోసం అనుమతులు తీసుకుంటామని, వాటి డబ్బు నేరుగా మైనింగ్ శాఖకు చెల్లిస్తామని చెప్పారు. గద్వాల జిల్లా పంచాయతీ అధికారి శ్యాంసుందర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు రూపాయి కూడా సీనరేజీ ఛార్జీల రూపంలో గ్రామాలకు రాలేదన్నారు.

ఎన్‌హెచ్-167కే: కల్వకుర్తి - కొల్లాపూర్ వరకు (77 కిలోమీటర్లు)
మొత్తం విలువ: రూ.886.69
మట్టి పని విలువ: సుమారు రూ.266 కోట్లు

● నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొంపేట వద్ద ఓ గుట్టను కొల్లగొడుతున్నారు. జాతీయ రహదారి పనుల పేరుతో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాల అవసరాలకు మట్టిని తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలోని పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. సుమారు రూ.5 కోట్ల విలువైన వ్యాపారం మైనింగ్ పేరుతో జరిగినట్లు అంచనా.

గర్భిణులకు అమ్మ కోసం



యాప్‌పై ఏఎన్ఎంలకు శిక్షణ



అమ్మ కోసం రూపొందించిన ప్రత్యేక యాప్

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : గర్భిణుల కోసం తెలంగాణ ప్రభుత్వం 'అమ్మకోసం' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గర్భిణుల్లో ప్రధానంగా వచ్చే రక్తహీనతతో పాటు రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ వంటి సమస్యలను అరికట్టేందుకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఎన్ఎంలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జిల్లాలో రక్తహీనత సమస్యతో బాధపడే వారు ఎంత మంది ఉన్నారు? ఆ సమస్య ఎలా అరికట్టాలి? ఎలాంటి ఆహారం తీసుకోవాలి? అసలు సమస్య రాకుండా ముందస్తుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు.

క్విజ్ పోటీలు..: అమ్మకోసం యాప్ ద్వారా రోజూ ఏఎన్ఎంలకు చరవాణిలో దృశ్య, శ్రవణం ద్వారా గర్భిణులకు అందించే వైద్య సేవలపై వివరిస్తారు. ప్రధానంగా గర్భిణుల్లో వచ్చే రక్తహీనతను సకాలంలో గుర్తించి ముందే నివారణ చర్యలు తీసుకుంటే కాన్పు సమయంలో ఎదురయ్యే ఎక్కువ ప్రమాద స్థాయి (హైరిస్క్)ని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. ఏఎన్ఎంలు విని, నేర్చుకున్న అంశాలపై వారి సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఆన్‌లైన్ లోనే వారికి క్విజ్ పోటీలు నిర్వహిస్తారు.

గర్భం దాల్చిన మూడు నెలల నుంచి..: మహిళ గర్భం దాల్చిన మూడు నెలల నుంచి వైద్య సేవలు అందిస్తారు. ప్రతి నెల గర్భిణి ఆరోగ్య పరిస్థితి, పిండం ఎదుగుదలను పరిశీలిస్తారు. ఎక్కువ ప్రమాదకర స్థాయి పరిస్థితిలో ఎలాంటి వైద్యం అందించాలి, ఎక్కడికి తీసుకెళ్లాలని అంశాలపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తారు. ప్రతినెల నిర్వహించే వైద్య పరీక్షలను ఎప్పటికప్పుడు పరిశీలించి ఏదైన సమస్య ఉంటే వెంటనే నివారణ కోసం వైద్యులను సంప్రదిస్తారు. గర్భిణులు మధుమేహం బాధితులుంటే.. బిడ్డకు సోకకుండా వైద్యుల సూచనతో మందులు అందించడం, ఎలాంటి ఆహార నియమాలు పాటించాలో అవగాహన కల్పిస్తారు.



ఉపయోగకరంగా ఉంది..: గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎక్కువ ప్రమాదస్థాయి విధానాన్ని గుర్తించడం, నివారణ చర్యలపై రోజు వారి కార్యక్రమాలు యాప్ ద్వారా వివరిస్తారు. గతంలో పుస్తకరూపంలో అందించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా నేర్పిస్తున్నారు. చాలా ఉపయోగకరంగా ఉంది.

- గీతాదేవి, ఏఎన్ఎం, పెద్దగూడెం



ప్రమాదస్థాయి తగ్గించేందుకే..: గర్భిణుల్లో రక్తహీనతను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటే కాన్పు సమయంలో ఎలాంటి నష్టం జరగకుండా చూసుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రమాదకర పరిస్థితులుంటే మాతాశిశు సంక్షరణ కేంద్రాలకు తీసుకెళ్లి వైద్య సేవలందిస్తాం. ప్రతి మూడు నెలలకు వైద్య పరీక్షలు నిర్వహించి పిండం ఎదుగుదల, ఆరోగ్య సమస్య లుంటే గుర్తించి ముందస్తుగా నివారణ చర్యలు తీసుకుంటాం.

- డి.ఝాన్సీ, జిల్లా మాతాశిశు సంరక్షణ కార్యక్రమ అధికారిణి

వృథా వస్తువులకు కొత్తరూపం



టైర్లతో చేసిన కుండీని పరిశీలిస్తున్న పుర అధ్యక్షురాలు మంగమ్మ, ఉపాధ్యక్షుడు గోపి

అమరచింత, న్యూస్‌టుడే : ఇంట్లో వృథాగా వేసే ప్లాస్టిక్ సీసాలు, డబ్బాలతో ఇంట్లో అలంకరణకు ఉపయోగపడే వస్తువులు, పూల కుండీలు చేసుకోవచ్చని పుర అధ్యక్షురాలు వి.మంగమ్మ, ఉపాధ్యక్షుడు గోపి అన్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు 'స్వచ్ఛతా హీ సేవ' పక్షోత్సవాల్లో భాగంగా ఆర్పీలు, డీపీవోలు, వార్డు అధికారులు, పుర కార్మికులు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన బుధవారం పురపాలక సంఘం కార్యాలయంలో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పుర కార్మికులకు రెండు జతల దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ నూరుల్ నజీబ్, మేనేజర్ యూసుఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి సహకరించండి

అమ్రాబాద్, న్యూస్‌టుడే : ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణానదిపై పదర మండలం మద్దిమడుగు సమీపంలో వంతెన నిర్మాణానికి సహకరించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను ఎమ్మెల్యే వంశీకృష్ణ కోరారు. శ్రీశైలం దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమైన మంత్రిని బుధవారం మన్ననూరు అటవీ శాఖ అతిథి గృహంలో ఎమ్మెల్యే కలిశారు. వంతెన నిర్మాణంతో ఆంధ్ర నుంచి రాయచూరుకు వెళ్లేందుకు సమయం తగ్గుతుందన్నారు. అనంతరం మంత్రికి నల్లమల తేనెను అందించారు. మండల కేంద్రంలోని మరో కార్యక్రమంలో రూ.500కే గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన పత్రాలను మహిళలకు అందజేసి మాట్లాడారు. ఇక్కడి మహిళా సంఘాలకు రూ.50 కోట్ల వడ్డీ లేని రుణాలను త్వరలో అందించనున్నట్లు తెలిపారు. రూ.10 కోట్లతో సీసీ రహదారులు, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సింగిల్‌విండోలో తీసుకున్న రూ.8 కోట్ల పంట రుణాలు మాఫీ చేసేందుకు సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఎంపీడీవో వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ వెంకటయ్య, నేతలు పాల్గొన్నారు.

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట మండలం చెన్నారంలో మహిళలకు రాయితీ వంటగ్యాస్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ అందజేశారు. రూ.25 లక్షలతో నిర్మిస్తున్న యాదవ సామాజిక భవనం పనులను పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేందర్, గోపాల్‌రెడ్డి, కాశన్న యాదవ్, నర్సయ్య పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తికి 41,039 క్యూసెక్కుల నీరు

ఆత్మకూరు: జూరాల జలాశయం వద్ద 55,800 క్యూసెక్కుల వరద నీటి ఉధృతి కొనసాగుతున్న పరిస్థితుల్లో విద్యుదుత్పత్తికి 41,039 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.158, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.400 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం బుధవారం నాటికి ఎగువన 220.143, దిగువన 195.234 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగినట్లు జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

కనీస మద్దతు ధర చట్టం చేయాలి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు కనీస ధర నిర్ణయించి చట్టం చేయాలని వనపర్తి జిల్లా సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య బుధవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. భాజపా ప్రభుత్వం రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు బాలయ్య, మురళి, కురుమయ్య పాల్గొన్నారు.

ఊరూరా బతుకమ్మ సంబురాలు

కొత్తకోట, న్యూస్‌టుడే: బతుకమ్మ సంబరాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆటపాటలతో మహిళలు పండగకు స్వాగతం పలికారు. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఆడి పాడారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సాయంత్రం సందడి నెలకొంది పూలను సేకరించి అమ్మవారి అలంకరణకు పూనుకున్నారు.

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలోని రాంనగర్ మహిళలు అమావ్యాస పూజలు నిర్వహించి ఎంగిలి బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తంగడి ఆకు, పూలు, బంతి పూలతో బతుకమ్మ బోనం సిద్ధం చేసి పండగ ప్రాముఖ్యతను వివరించే పాటలకు బొడ్డెమ్మలు వేశారు. పట్టణ శివారులోని చింతల కుంట చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూజిలాండ్‌లో ప్రారంభమైన బతుకమ్మ వేడుకల్లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండగకు కేసీఆర్ విశేష ప్రాచుర్యం కల్పించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి సంస్కృతి, సంప్రదాయాలను జోడించి విశ్వవ్యాప్తం చేసిన ఘనత ఆయన సొంతమన్నారు.



కొత్తకోట కన్యకాపరమేశ్వరి ఆలయంలో బతుకమ్మను సిద్ధం చేస్తున్న మహిళలు



కొత్తకోట మండలం అప్పరాలలో మహిళల నృత్యం



అమరచింత రాంనగర్‌లో

ఉపాధ్యాయ నియామకాల్లో..

స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం

అచ్చంపేట, న్యూస్‌టుడే: డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల్లో 1:3 నిష్పత్తి ప్రకారం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జిల్లా కేంద్రాల్లో కొనసాగుతోంది. ఈ ప్రక్రియ 5న ముగియనుంది. అర్హులను ఎంపిక చేసి హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు ఆయా జిల్లాలకు చెందిన స్థానిక అభ్యర్థులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మొత్తం ఖాళీల్లో 95 శాతం స్థానికులతో భర్తీ చేయనున్నారు. మిగతా 5 శాతం ఖాళీలను ఓపెన్ విభాగంలో భర్తీ చేయనున్నారు. ఈ ఖాళీల్లో స్థానిక అభ్యర్థులతో పాటు స్థానికేతరులను మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,131 ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం సుమారు 3,399 మంది అభ్యర్థులను 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేసి ధ్రువపత్రాలు పరిశీలిస్తున్నారు.



ఎంపిక విధానం ఇలా..: ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు అభ్యర్థులు సాధించిన మెరిట్‌తోపాటు రోస్టర్ పాయింట్లను పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేయనున్నారు. రాత పరీక్షకు 80 శాతం, టెట్‌కు 20 శాతం మార్కులను పరిగణనలోకి తీసుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులకు మాత్రం వంద శాతం మార్కులను రాత పరీక్ష ఆధారంగా పరిగణనలోకి తీసుకుంటారు. ఆయా వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకొని రోస్టర్ పాయింట్లను నిర్ణయించనున్నారు.

● ఒకే అభ్యర్థి ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైతే వారి నుంచి ఆసక్తి ఉన్న పోస్టును ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించి రాత పూర్వకంగా లేఖను తీసుకుంటారు. అభ్యర్థి ఎంపిక చేసుకున్న పోస్టును మినహాయించి ఆ అభ్యర్థి ఎంపికైన ఇతర విభాగాల పోస్టుల నుంచి పేరును తొలగించనున్నారు. ఈ విధానం అమలు చేయడం వల్ల ఖాళీలు మిగిలిపోయే అవకాశం లేదు. తర్వాత ఉన్న మెరిట్ అభ్యర్థులతో ఆ ఖాళీలను వెంటనే భర్తీ చేయనున్నారు.

● అభ్యర్థులు సాధించిన మెరిట్‌తోపాటు రోస్టర్ పాయింట్లను పరిగణనలోకి తీసుకొని ఎంపికైన తుది అభ్యర్థుల జాబితాను నోటీస్ బోర్డుపై ప్రకటించనున్నారు. ఈ అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా 9న నియామక పత్రాలు అందజేయనున్నారు.

● జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఖాళీల వివరాలను కూడా నోటీస్ బోర్డుపై అందుబాటులో ఉంచుతారు. పాఠశాలలు, సబ్జెక్టులు, మాధ్యమం వారీగా ఖాళీలను ప్రకటిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు పాఠశాలలను కేటాయించే సమయంలో అభ్యర్థి సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకొని ర్యాంకులు కేటాయించి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అందుబాటులో ఉన్న ఖాళీల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులు ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో వారికి నియామక పత్రాలు అందజేస్తారు. బాలికల పాఠశాలల్లో మహిళా అభ్యర్థులు అందుబాటులో ఉన్నప్పుడు వారితోనే భర్తీ చేయాలన్న నిబంధన పెట్టారు. దసరా సెలవుల తర్వాత కొత్త ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకుంటున్నారు.

తీరంలో గలీజు

ఎసైన్‌మెంట్ కమిటీ భూముల్లో కొత్తకోణం



కృష్ణా నది తీరంలో సాగవుతున్న ప్రభుత్వ భూమి

న్యూస్‌టుడే-మాగనూరు

కృష్ణా నది తీరంలో దశాబ్దాల క్రితం బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం ద్వారా సంక్రమించిన అసైన్‌మెంట్ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. కృష్ణా, మాగనూరు మండలాల్లో 2140 ఎకరాలు వివిధ సంవత్సరాల్లో లబ్ధిదారులకు పంచారు. పట్టాలు ఇచ్చినా భూమి ఎక్కడుందో చాలామంది లబ్ధిదారులకు చెప్పకపోవడంతో వారంతా ఏళ్లతరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై గత నెల 26న 'ఈనాడు'లో 'తీరంలో భూ మాయ' శీర్షికన కథనం రావడంతో యంత్రాంగంలో చలనం వచ్చింది. ఈ క్రమంలో మరో కోణం వెలుగు చూస్తోంది. అప్పట్లో కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు కొందరు లబ్ధిదారులతో ఏమీ చెప్పకుండా వేలిముద్రలు వేయించి 99 ఏళ్లకు లీజుకు తీసుకున్నట్లు పత్రాలు సృష్టించారు. దశాబ్దాలు గడిచిపోవడంతో కొందరు లబ్ధిదారులు కాలం చేశారు. అసైన్‌మెంట్ భూములు రిజిస్ట్రేషన్ కావని అందరికీ తెలిసిందే. అప్పట్లో కొందరు మధ్యవర్తులు గుట్టుగా ఈ పని చేయించారు.


● కృష్ణా మండలం అయినాపూర్, తంగడిగి, కుసుమర్తి, కాలహళ్లి, గుర్జాల, గుడేబల్లూర్ శివారుల్లోని చాలామేరకు ప్రభుత్వ భూములు ఇతరుల ఆధీనంలో ఉన్నాయి. లబ్ధిదారుల వారసులు కొందరికైతే తమ పేరిట ప్రభుత్వ భూమి ఉందని తెలియదు. ● భూ సంస్కరణ చట్టంలో లోసుగుల ఆధారంగా ఇప్పటికే చాలా మందికి ప్రభుత్వం ద్వారా సంక్రమించిన భూములు ఇతరుల పేరిట మారిపోయాయి. లీజుకు ఇవ్వని మరికొన్ని భూములు కూడా అన్యాక్రాంతం అయ్యాయి. ఉదాహరణకు మురహరిదొడ్డి శివారులో 7 ఎకరాలు ఇతరుల పేరిట మారిపోయింది. అయినాపూర్ పరిధిలో దాదాపు 50 ఎకరాలకు పైగా బడుగు బలహీన వర్గాల పేరిట అలాగే ఉంది. ప్రస్తుతం కాస్తులో వేరేవారు ఉన్నారు. పట్టాదారుల కుటుంబీకులు వలస వెళ్లిపోవడంతో ఈ విషయం వెలుగులోకి రాలేదు.

● ఈ రెండు మండలాల్లో బడుగు, బలహీన వర్గాల లబ్ధిదారులు తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పడానికి బయటకు రావడంలేదు. పెద్దలతో తమకు తలనొప్పి ఎదురవుతుందని భయపడుతున్నారు. అధికార యంత్రాంగం స్పందించి లబ్ధిదారుల పేర్లు మారిన వ్యవహారం, అలాగే 99 ఏళ్ల లీజు సంగతి తేల్చాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి నోటీసులు ఇస్తాం: కృష్ణా నదీ తీరంలో ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల విషయంలో పూర్తి స్థాయిలో విచారణ చేస్తాం. రికార్డులలో ఉన్న లబ్ధిదారులు కాస్తులో ఉన్నారా లేదా అన్నది ముందు గుర్తించి హైడ్రా తరహాలో నోటీసులు ఇస్తాం. ఈ విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తాం. ఉన్నతాధికారులకు నివేదించాక చర్యలు చేపడతాం.

- దయాకర్‌రెడ్డి, తహసీల్దారు, కృష్ణా

నాడు నువ్వా నేనా... నేడు నువ్వానేను!



గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కాంగ్రెస్ తరపున, అప్పటి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి భారాస తరపున తలపడ్డారు. పార్టీల పరంగా విమర్శల బాణాలు సంధించుకున్నారు. చాలా రోజుల తరువాత ఇద్దరూ ఒకే కార్యక్రమంలో పాల్గొన్నారు. అందుకు ఊట్కూరులో గాంధీవిగ్రహావిష్కరణ వేదికయ్యింది. రాజకీయాలు ఎన్నికల వరకే... మంచి పనికి కలిసి పనిచేయాలన్న సంకేతం ఇచ్చారు.

- న్యూస్‌టుడే, ఊట్కూరు

నవోదయలో ప్రవేశాలకు తరుణమిదే



నవోదయ విద్యాలయం ముఖద్వారం

బిజినేపల్లి, న్యూస్‌టుడే: కార్పొరేట్ పాఠశాలకు దీటుగా అత్యున్నత ప్రమాణాలతో విద్యనందిస్తూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది వట్టెం నవోదయ విద్యాలయం. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెంలో 1994లో దీనిని ప్రారంభించారు. నాటి నుంచి వేలాది మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారు ఎంచుకున్న రంగాల్లో స్థిర పడేందుకు దోహదపడింది. నూతన ప్రవేశాలకు ప్రకటన వెలువడిన నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

మిగులు సీట్ల భర్తీ

2025-26లో మిగులు సీట్ల భర్తీకి ప్రకటన వెలువడింది. 9వ తరగతిలో చేరేందుకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 01.05.2010 నుంచి 31.07.2012 మధ్య జన్మించి ఉండాలి. ఇంటర్‌లో చేరే విద్యార్థులు ప్రస్తుతం పదోతరగతి చదువుతూ 01.06.2008 నుంచి 31.07.2010 మధ్య జన్మించిన వారై ఉండాలి. విద్యార్థులు అక్టోబరు 30 లోగా విద్యాలయ వెబ్‌సైట్‌లో దరఖాస్తు పూర్తి చేయాలి. రాత పరీక్ష ఫిబ్రవరి 08 2025న నిర్వహిస్తారు.

ఎంపిక విధానం ఇలా..

నవోదయ విద్యాలయం ఏటా ఆరో తరగతిలో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థులు 01.05.2013 నుంచి 31.07.2015 మధ్య జన్మించి ఉండాలి. మొత్తం 80 సీట్లకు 75 శాతం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో జనరల్‌కు 37, ఓబీసీలకు 22, ఎస్సీలకు 12, ఎస్టీలకు 6, దివ్యాంగులకు 3 సీట్లు కేటాయిస్తారు. ప్రతి కేటగిరిలోనూ బాలికలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుంది. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది: 07 అక్టోబరు 2024. 18 జనవరి 2025 ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

- ఈ విద్యాలయంలో చదువుతోపాటు విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం, యోగా, కరాటే వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. చిన్నతనం నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, సేవా భావం అలవాటు పడేలా ఎన్‌సీసీని నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతోంది. ప్రతిష్ఠాత్మక ఐఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందేలా సన్నద్ధం చేస్తోంది.

- విద్యాలయంలో ప్రవేశాలు మెరిట్ ప్రకారమే ఉంటాయి. ప్రవేశాల కోసం దళారులను ఆశ్రయించవద్దు. అభ్యర్థి సామర్థ్యాన్ని బట్టి సీబీఎస్‌ఈ ద్వారా ఎంపిక ఉంటుంది. ఎవరైనా సీటు ఇప్పిస్తామని మభ్యపెడితే ఫిర్యాదు చేయాలి.
- భాస్కర్‌కుమార్, ప్రిన్సిపల్ నవోదయ విద్యాలయ సమితి.

అమ్మవారి క్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ


విద్యుత్తు దీపాల అలంకరణలో ఐదో శక్తిపీఠం అలంపూర్ జోగులాంబ అమ్మవారి దేవాలయం

న్యూస్‌టుడే,అలంపూర్, మహబూబ్‌నగర్ సాంస్కృతికం

దేవీ నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ఆలయాల్లో శైవ సంప్రదాయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు, వైష్ణవ సంప్రదాయంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఇదే మాసంలో నిర్వహిస్తారు. కొత్తగా పెళ్లయిన ఆడబిడ్డలు పుట్టింటికి చేరుకుంటారు. ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండగ నిర్వహిస్తారు. రకరకాల పిండివంటలు చేసుకుంటారు. ఊరూరా నెల కొల్పే దుర్గామాత విగ్రహాల వద్ద కోలాటాలు, బతుకమ్మ ఆటలతో సాంస్కృతిక శోభ ఉట్టిపడనుంది. పాండవులు జమ్మిచెట్టు మీద దాచిన ఆయుధాలను తీసుకుని యుద్ధం చేసి శత్రువులను ఓడించిన వృత్తాంతాన్ని గుర్తుచేసుకుంటూ దసరా రోజు సాయంత్రం వేళ ప్రజలు జమ్మిచెట్టుకు పూజలు చేస్తారు. అనంతరం శమీపత్రాలను తల్లిదండ్రులు, పెద్దలకు సమర్పించి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. పలు చోట్ల రావణ దహనం కార్యక్రమం చేపడతారు. మన్యంకొండ శ్రీవేంకటేశ్వరస్వామి, చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తిస్వామి, బీచుపల్లి ఆంజనేయస్వామి, మద్దిమడుగులోని ఆంజనేయస్వామి, పాలెం, కోస్గిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైష్ణవ సంప్రదాయం ప్రకారం వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు.

శక్తిపీఠంలో వైభవంగా ఉత్సవాలు



రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ శ్రీజోగులాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. భారీగా తరలివచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించటంతో ప్రత్యేక శోభ సంతరించుకుంది. నవరాత్రుల్లో అమ్మవారు శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంటాదేవి, కూష్మాండదేవి, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిదాత్రిగా ప్రత్యేక దర్శనమిస్తారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. రోజూ త్రిశతి, ఖడ్గమాల అర్చనలు నిర్వహిస్తారు. ప్రత్యేకంగా కుమారి, సువాసిని పూజ నిర్వహిస్తారు. ఆలయ ప్రధాన అర్చకులు డిండిగల్ ఆనంద్‌శర్మ అర్చక బృందం ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, హారతితో పూజలు ప్రారంభించి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహిస్తారు. సహస్ర నామార్చన, నవవర్ణ అర్చన, తర్వాత చండీ హోమం ఉంటాయి. 9న ఉదయం 10 గంటలకు మూలానక్షత్ర శుభ సమయమున జోగులాంబ అమ్మవారు, బాల బ్రహ్మేశ్వరస్వామి వారి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు సింహవాహన సేవ, 10న దుర్గాష్టమి సందర్భంగా ఉదయం 10 గంటలకు రథోత్సవం, 11న మహర్నవమి పురస్కరించుకుని కాళరాత్రి పూజ నిర్వహిస్తారు. 12న విజయదశమి రోజు ఉదయం 8 గంటలకు మహాపూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు శమీపూజ, 6.30 గంటలకు నదీహారతులు, జోగులాంబ అమ్మవారు, శ్రీబాలబ్రహ్మేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంసవాహనంలో ఆసీనులను చేసి తుంగభద్ర నదిలో తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తారు. ఈ వేడుకలో సుమారు 15 వేలమంది వరకు భక్తులు పాల్గొంటారని ఆలయం ఈవో పురేందర్ తెలిపారు.

ఉత్సవ సమయంలో అలంపూర్ ఆలయాల్లో ఆర్జిత సేవలు

ఆర్జిత సేవ	సమయం	రుసుము(రూ॥ల్లో)
సహస్రనామార్చన	ఉ॥ 7.30 నుంచి సా॥ 6 వరకు	1,000
శ్రీచక్ర నవావరణ అర్చన	ఉ॥ 9 గంటలకు	500
త్రిశతి అర్చన	ఉ॥ 8 నుంచి 11.30	500
ఖడ్గమాల అర్చన	మ॥ 2 నుంచి సా॥ 4 వరకు	300
చండీహోమం	ఉ॥ 10 గంటలకు	1,000
రథోత్సవం	సా॥ 6.30 గంటలకు	1,000
కొలువు పూజ, దర్బారు సేవ, సువాసిని, కుమారి పూజలు	సా॥ 7 గంటలకు	300
సామూహిక కుంకుమార్చన	మధ్యాహ్నం 2.30 నుంచి 3.30	ఉచితం
ఉదయాస్తమయ సేవ		3,000

(త్రిశతి, ఖడ్గమాల అర్చనలు కుంకుమార్చన మండపంలో నిర్వహిస్తారు)


విద్యుత్తు దీపకాంతుల్లో మహబూబ్‌నగర్‌లోని రేణుక ఎల్లమ్మ దేవాలయం

ఎల్లమ్మ ఆలయంలో సందడి

మహబూబ్‌నగర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. దేవాలయాన్ని సుందరంగా అలంకరించారు. రోజూ తెల్లవారుజామున 4 గంటల నుంచి మూలవిరాట్టుకు అభిషేకంతో పూజలు ప్రారంభిస్తారు. అలంకరణ, కుంకుమార్చన మహానివేదన తర్వాత భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయి. అమ్మవారిని 3న బాలత్రిపుర సుందరి, 4న లక్ష్మీదేవి, 5న గాయత్రీదేవి, 6న వనదుర్గాదేవి, 7న అన్నపూర్ణాదేవి, 8న శాకంబరిదేవి, 9న సరస్వతీ దేవిగా అలంకరిస్తారు. 10న కాళికాదేవిగా నిమ్మకాయలు, గుమ్మడికాయలతో అలంకరించి చేసి కుంభం పోస్తారు. 11న దుర్గాదేవి 12న రేణుకాఎల్లమ్మగా అలంకరించి ఆలయ వద్ద ఉన్న జమ్మిచెట్టుకు పూజ చేస్తారు. స్థానిక అంబాభవానీ, కాళికాదేవి, మహబూబ్‌నగర్, జడ్చర్లలోని వాసవీమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.


అలంపూర్ ఆలయ స్వాగత తోరణం

ఐదుగురు సంతానమున్నా..
అనాథలుగా తల్లిదండ్రులు

కాటేదాన్, న్యూస్‌టుడే: కన్నబిడ్డలు ఒక్కరూ ఆ తల్లిదండ్రులను అక్కున చేర్చుకోలేదు. వారికి దూరంగా జీవించాలనే ఉద్దేశంతో మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం మాసన్‌పల్లికి చెందిన వెంకటయ్య, నరసమ్మ దంపతులు రెండు వారాల క్రితం రాజేంద్రనగర్ చేరుకున్నారు. గగన్‌పహాడ్, బెంగళూరు జాతీయరహదారిలోని అండర్ పాస్ కింద తలదాచుకుంటున్నారు. ఆ వృద్ధ జంటను రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఆదుకుని ఆకలి తీరుస్తున్నారు. బుధవారం 'న్యూస్‌టుడే' వారిని పలకరించగా.. 'మాకు నలుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు. ఆడపిల్లలకు వారి సమస్యలు వారికుంటాయి...కొడుకు మమ్మల్ని నిర్లక్ష్యం చేస్తున్నాడు. భిక్షాటన చేసుకుంటున్నాం. అటు కొడుకు, ఇటు కూతుళ్లు ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు వివరించారు. పోలీసులు మా కడుపు నింపుతున్నారు. మా పిల్లల ఫోన్ నెంబర్లు తీసుకుని వారితో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నా స్పందన లేదు. మేము పనిచేసే స్థితిలో లేం.. ఏమి చేయాలో అర్థం కావడం లేదు' అంటూ కన్నీళ్లపర్యంతమయ్యారు. ట్రాఫిక్ ఎస్సై రాజేందర్ మాట్లాడుతూ వారి పిల్లలతో మాట్లాడి తీసుకెళ్లేలా చూస్తాం.. అలా ఆసక్తి లేనిపక్షంలో ఉన్నతాధికారులతో చర్చించి ఏదైనా వృద్ధాశ్రమంలో చేర్పించేందుకు చొరవ తీసుకుంటామని చెప్పారు.


ఆకలి తీరుస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు

ఇలవేల్పుగా జములమ్మకు పూజలు


ముస్తాబైన జములమ్మ దేవత ఆలయం

గద్వాల కలెక్టరేట్ : గద్వాల సమీప జమ్మిచేడులో వెలసిన జములమ్మ ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతివారం మంగళ, శుక్రవారాల్లో 10వేల వరకు భక్తులు దర్శించుకుంటారు. కలశస్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభిస్తారు. రోజూ ఉదయం 8 గంటలకు విశేష ఫలపంచామృతాభిషేకం, అలంకరణ పూజలుంటాయి. తొమ్మిది రోజుల్లో మహాలక్ష్మీదేవి, గజలక్ష్మి, అన్నపూర్ణదేవి, శాకాంబరిదేవి, పార్వతి, ధనలక్ష్మి సరస్వతీమాత, దుర్గాదేవి, మహిషాసురమర్దినిగా దర్శనమిస్తారు. చివరిరోజు జములమ్మ నిజరూపంలో దర్శనమిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు కోనేరులో తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు.

అడవి మధ్యలో కొలువైన మైసమ్మ



నవాబుపేట మండలం కాకర్లపాడు పరిధి అటవీ ప్రాంతంలో వెలసిన ఫతేపూర్ మైసమ్మ దేవత భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్నారు. ప్రతి ఆది, మంగళవారాల్లో వేలాది భక్తులు దర్శించుకుంటారు. శరన్నవరాత్రుల్లో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తారని ఆలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. నవరాత్రులను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మొదటిరోజు గణపతిపూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, చక్రపూజ కైంకర్యాలతో అమ్మవారిని పూజిస్తారు. నవరాత్రుల్లో మూలవిరాట్టుకు రోజుకో అలంకరణ చేసి ఆరాధించనున్నట్లు ప్రధాన అర్చకుడు శ్రీకాంత్‌శర్మ తెలిపారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



మల్దకల్, న్యూస్‌టుడే: అమావాస్య సందర్భంగా మల్దకల్ ఆదిశిలాక్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, గోపూజ, శాంతిహోమం, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి, పుష్పార్చన, అలంకరణ, మహామంగళహారతి సాయంత్రం పల్లకీసేవ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఈవో సత్యచంద్రారెడ్డి, ఛైర్మన్ ప్రహ్లాదరావు పాల్గొన్నారు.

ఆదిశిలావాసుడి మూలవిరాట్

బాగుపడిన పుష్కరఘాట్



ఈనాడు కథనానికి స్పందన

జోగులాంబ ఆలయ పుష్కరఘాట్ దుర్భరంగా ఉన్న పరిస్థితిపై సెప్టెంబరు 30వ తేదీన 'పుణ్యస్నానాలు చేసేదెలా' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఆలయ అధికారులు స్పందించి ఘాట్‌లోని చెత్తాచెదారం తొలగించారు. పిండ ప్రదానం చేసేందుకు ప్రత్యేకంగా ఒక వైపు టెంట్ ఏర్పాటు చేశారు. అటు వైపు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, అలంపూర్

చెరువులో పడి యువకుడి మృతి


శ్రీకాంత్

మద్దూరు, న్యూస్‌టుడే: మద్దూరు మండలం చెన్నరెడ్డిపల్లిలో చెరువులోపడి యువకుడు మృతిచెందాడు. గ్రామానికి చెందిన సాయిలు, మొగులమ్మ దంపతుల కుమారుడు శ్రీకాంత్(20) బుధవారం ఉదయం స్నానం చేయడానికి స్నేహితులతో కలిసి చెరువుకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా అదుపు తప్పి చెరువులో మునిగిపోయాడు. ఈత రాకపోవడంతో బయటపడలేకపోయాడు. స్నేహితులు బయటకు తీసేసరికి అప్పటికే శ్రీకాంత్ మరణించాడు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడు..

భూత్పూర్, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. 25 - 30 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం ద్విచక్రవాహనంపై బిజినేపల్లి మార్గంలో వెళ్తుండగా వెల్కిచర్ల పెట్రోల్ బంకు నుంచి బయటకు వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి, తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వద్ద లభించిన ద్విచక్రవాహనం భూత్పూర్ పురపాలిక గోప్లాపూర్‌కు చెందినది గుర్తించారు. ఈ వాహనం చోరీకి గురైందని దాని యజమాని ఇప్పటికే ఠాణాలో ఫిర్యాదు చేశారు. వ్యక్తి మృతికి కారణమైన కారును ఠాణాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, సంబంధితులు ఉంటే మృతదేహం కోసం తమను సంప్రదించాలని ఎస్సై చంద్రశేఖర్ కోరారు.

రైలు ఢీకొని ఒకరి దుర్మరణం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలైన చెందిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం.. మహబూబ్‌నగర్ పట్టణం తిరుమలదేవుని గుట్ట (టీడీగుట్ట) రైల్వే గేటు వద్ద రైలు పట్టాల సమీపంలో సుమారు 35 ఏళ్లున్న గుర్తుతెలియని వ్యక్తి బహిర్భూమికి వెళ్లగా రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతుడి జేబులో ద్విచక్రవాహనం తాళం చెవి ఉండటంతో సమీపంలోని అన్ని ప్రదేశాల్లో వాహనం కోసం వెతికినా లభించలేదు. సంబంధితులు ఎవరైనా ఉంటే మృతదేహం కోసం రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్సై కోరారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం

జడ్చర్ల, న్యూస్‌టుడే : అప్పుల బాధతో ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన జడ్చర్ల మండలంలో వెలుగు చూసింది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. పోలేపల్లి గ్రామానికి చెందిన మిద్దె గణేశ్(18) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రులు చనిపోవడంతో పెద్ద అక్క వద్ద మరో సోదరి, ఆయన ఉంటున్నారు. వివిధ అవసరాల కోసం చేసిన అప్పులు పెరిగాయి. ఈ నెల 1న తెలిసిన వారి వద్ద అప్పు తీసుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబానికి చెందిన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని గ్రామస్థులు బుధవారం ఉదయం గుర్తించారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు అక్క నీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

సమాజంలో మార్పు అవసరం


అలంపూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర

- శివార్చక విజయకుమార్
- అలంపూర్‌లో బాపూ సత్యశోధన పాదయాత్ర ప్రారంభం

అలంపూర్, న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో మార్పు అవసరమని విశ్రాంత డీఈవో శివార్చక విజయకుమార్ పేర్కొన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్‌ల ఆధ్వర్యంలో బుధవారం అలంపూర్ ఆలయాల నుంచి ఆయన సారథ్యంలో బాపూ సత్యశోధన పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేలా చైతన్యపరచడమే యాత్ర ఉద్దేశమని వివరించారు. పిల్లలే దేశ భవిష్యత్తని, వారిని వ్యసనాలకు దూరంగా క్రమశిక్షణతో ఉంచాల్సిన బాధ్యత పెద్దలదేనని ఆయన పేర్కొన్నారు. గాంధీ సిద్ధాంతాలు పిల్లలకు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. పాదయాత్ర పట్టణంలోని వివిధ కాలనీల్లో కొనసాగించారు. గురువారం ఉదయం అలంపూర్ పట్టణం నుంచి ఉండవల్లికి పాదయాత్ర సాగుతుంది. 100 రోజుల పాటు వెయ్యి కిలోమీటర్లు సాగిన అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని ఉమామహేశ్వర ఆలయం వద్ద వచ్చే జనవరి 12న ముగుస్తుంది. కన్యకా పరమేశ్వరి అన్నదాన సత్రంలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి బి.ఎన్.వేణుగోపాల్, వెంకట్రామయ్యశెట్టి, ఎన్‌ఐపీ సంస్థ నాగేంద్రస్వామి, కల్యాకార్ చంద్రశేఖర్, మాధవరెడ్డి, కృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు


మైదానాన్ని చదును చేయిస్తున్న అధికారులు

ధన్వాడ, న్యూస్‌టుడే : స్థానిక అప్పాజీ మైదానంలో గురువారం నుంచి 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) బాలికల రెజ్లింగ్(కుస్తీ) పోటీలను నిర్వహిస్తున్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు సారథ్యంలో పీడీలు రవికుమార్, సాయినాథ్, బాల్‌రాజు, రామకృష్ణ, కోచ్ శ్రీనివాస్ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మట్టిపోసి మైదానాన్ని సమాంతరంగా చేస్తున్నారు. అండర్ 14, 17, 19 ఏళ్ల విభాగాలలో పోటీలు జరుగుతాయి. పాత జిల్లాలవారీగా జట్లు పోటీలకు వస్తున్నాయి. క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.

ఒకరికి బదులుగా మరొకరిపై వేటు
కానిస్టేబుల్ సస్పెన్షన్‌లో తప్పు సరిదిద్దుకున్న పోలీసు శాఖ

కందనూలు, న్యూస్‌టుడే: ఒంటరిగా ఉన్న జంటల చిత్రాలు తీసి డబ్బులు వసూళ్లకు పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్లు రామచందర్, చిన్నాను ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సెప్టెంబరు 25న సస్పెండ్ చేశారు. కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌లో మరో కీలక మలుపు తిరిగింది. నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఠాణాలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ చిన్నా స్థానంలో రామును సస్పెండ్ చేయాల్సి ఉండగా అధికారులు పొరపాటున ఇదే ఠాణాలో పని చేస్తున్న చిన్నాను సస్పెండ్ చేశారు. ఎలాంటి కారణం లేకుండా సస్పెండ్ చేయడంతో బాధితుడు చిన్నా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి వివరాలు అందజేశారు. ఎస్పీ ఆదేశాల ప్రకారం బుధవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ కనకయ్య ఆధ్వర్యంలో మరోసారి విచారణ నిర్వహించి పూర్తి నివేదికను ఎస్పీకి అందజేశారు. ఎస్పీ ఉత్తర్వుల ప్రకారం కానిస్టేబుల్ రామును విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు సీఐ తెలిపారు. కానిస్టేబుల్ చిన్నాకు పట్టణంలోని ఠాణాలో పోస్టింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

రూ.50 లక్షలు ఇవ్వాలంటూ.. నక్సలైట్ పేరుతో బెదిరింపు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : తను నక్సలైట్ అని.. రూ.50 లక్షలు ఇవ్వాలని.. లేదంటే చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్‌గౌడ్ బుధవారం తెలిపారు. వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం సోళీపురం గ్రామానికి చెందిన తేనేటి శేఖర్‌రెడ్డి జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. మంగళవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఓ కొత్త నంబరు నుంచి ఆయన చరవాణికి ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తన పేరు సుదర్శన్ రెడ్డి, నక్సలైట్ అని చెప్పారు. వెంటనే రూ.50 లక్షలు ఇవ్వాలని లేదంటే చంపుతానని బెదిరించారు. దీంతో బాధితుడు ఎస్పీ రావుల గిరిధర్‌కు చరవాణి ద్వారా సమాచారం అందించారు. ఎస్సై సురేశ్‌గౌడ్ మంగళవారం రాత్రి ఇద్దరు కానిస్టేబుళ్లతో ఆయనకు భద్రత కల్పించారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110–00
రిటైల్	132–00
డ్రెస్డ్	191–00
స్కిన్‌లెస్	218–00

తెరపై ఈనాడు

శ్రీనివాస్: దేవర, వెంకటేశ్వర్లు: సత్యం సుందరం
– న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

సమస్యలు పట్టించుకోండి

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : గోపాల్‌పేటలోని కొన్ని వీధుల్లో మురుగు కాలువలు శుభ్రం చేయడంలేదని, వీధి దీపాలు వెలగడంలేదని గ్రామానికి చెందిన కొందరు యువకులు పంచాయతీ కార్యదర్శి బాలరాజుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఉదమ్మగడ్డ కాలనీకి వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగక రాత్రిపూట ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్, రాకేశ్, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు

మదనాపురం, న్యూస్‌టుడే : మండలంలోని అజ్జకొల్లులో బుధవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆవిర్భావ వేడుకలను కేవీపీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు మాట్లాడుతూ కుల వివక్ష, అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలన్నారు. అనంతరం అంబేడ్కర్ కూడలిలో కేవీపీఎస్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, చెన్నయ్య, మనిషర్మ, చిరంజీవి, మాసన్న, కురుమూర్తి, రాములు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలివ్వాలి

పాన్‌గల్, న్యూస్‌టుడే : చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డా. పరిమళ సూచించారు. బుధవారం మండలంలోని అన్నారం వెల్‌నెస్ కేంద్రం, పాన్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. క్రమం తప్పకుండా టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. ఆమెతో పాటు మండల వైద్యాధికారి చంద్రశేఖర్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి మైథిలి, పర్యవేక్షకురాలు శాంతమ్మ, ఆరోగ్య సహాయకురాలు రేవతి ఉన్నారు.



కొత్తకోటలో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకుల నివాళి



ఆత్మకూరులో పుర ఛైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు తదితరులు



పెబ్బేరులో నివాళులర్పిస్తున్న పుర అధ్యక్షురాలు కరుణశ్రీ, కౌన్సిలర్లు



పెబ్బేరు : లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ప్రమోదినిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

జాతిపిత.. స్ఫూర్తి ప్రదాత



అమరచింతలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

న్యూస్‌టుడే : జిల్లాలో మహాత్మాగాంధీ జయంతి ఘనంగా జరుపుకొన్నారు. పలుచోట్ల జాతిపిత విగ్రహాలను శుభ్రం చేసి పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యాలయాల్లో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. బాపూ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం మహాత్ముడు చేసిన పోరాటాన్ని, ఆయన జీవిత విశేషాలను గుర్తు చేసుకున్నారు. నేడు ప్రపంచ దేశాలు ఆయన్ను ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. పలుచోట్ల మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. అధికారులు, ఆయా పార్టీల నాయకులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. శ్రీరంగాపురం మండలంలోని కంబాళాపురంలో నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వనపర్తిలో టైలర్ మన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ప్రారంభించారు. జిల్లాలో మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు.



వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



వనపర్తిలో భారాస నాయకులు



మోజర్లలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, కళాశాల డీన్‌లు



వనపర్తి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు



ఖిల్లాగణపురంలో.. కాంగ్రెస్ నాయకుల నివాళి



గోపాల్‌పేటలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో..



అమరచింత : పురపాలక సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



శ్రీరంగాపురంలో రక్తదానం

రక్షణ గోడ నిర్మించండి



ఈర్ల వాగు వద్ద ప్రమాదకరంగా వంతెన

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : వనపర్తి-పెబ్బేరు ప్రధాన రహదారి తిరుమలయ్య గుట్ట సమీపంలో ఈర్లవాగుపై నిర్మించిన వంతెనకు రక్షణ గోడ లేక ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చోదకులు అదుపుతప్పితే కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. వెంటనే వంతెనకు రక్షణ గోడ లేదా ప్రమాదమని గుర్తించే విధంగా సిమెంట్ దిమ్మెలు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో అక్కడ ఎలాంటి నిర్మాణాలు లేవు నిర్వహణ నిధులతో ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపడతామని రహదారులు, భవనాల శాఖ ఏఈ రాకేశ్ తెలిపారు.

ప్రతిభావంతురాలికి సన్మానం

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 ఫలితాల్లో 12వ ర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన భాగ్యలక్ష్మిని బుధవారం మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు గౌని బుచ్చారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో పుర కో- ఆప్షన్ సభ్యుడు ముస్తాక్, ఆంజనేయులు, జానకిరాములు, రాజాగౌడ్, విజయ్‌కుమార్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలోని బాలకిష్టాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్థులు రూ.50 వేలు విరాళం సమకూర్చారు. విరాళాన్ని బుధవారం సీఐ శివకుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎనిమిది సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.1.50 లక్షలు ఖర్చు చేయాల్సి ఉండగా గ్రామస్థులు స్వచ్ఛందంగా విరాళం సమకూర్చడం అభినందనీయమన్నారు. మండలంలోని ఇతర గ్రామాలకు చెందిన వారు గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై నరేందర్, మాజీ సర్పంచి తుకారాం, గ్రామపెద్దలు మాసన్న, సత్యన్న, హటెల్లి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న బాలకిష్టాపూర్ గ్రామస్థులు

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలకు వినతి



పుర కమిషనర్ నాగరాజుకు వినతిపత్రాన్ని ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పురపాలికలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మనివర్ధన్‌రెడ్డి, గంగ, నాగేశ్వర్, గద్దం శ్రీకాంత్, వంశీ, ఎండీ రఫీక్, రమేశ్ యాదవ్, హమాలి అంజి, రామకృష్ణ యాదవ్ తదితరులు పుర కమిషనర్ నాగరాజుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ ఏడాది జూన్ 24న పురపాలికలో పరిశీలించి ప్రభుత్వ స్థలాలతో పాటు ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకోవడంతో పాటు బినామీల పేరిట క్రయ, విక్రయాలు పాల్పడినట్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే సిఫారసు లేఖతో మరోసారి ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు.

సంస్మరణ సభ జయప్రదం చేయండి

అమరచింత, న్యూస్‌టుడే : వనపర్తిలో ఈనెల 6న లక్ష్మీదేవమ్మ సంస్మరణ సభ విజయవంతం చేయాలని పుర వైస్ ఛైర్మన్ గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజయ్ కోరారు. బుధవారం జీఎస్ భవనంలో సంస్మరణ సభ గోడ పత్రిక విడుదల చేశారు. ఆమె చేసిన ఉద్యమాలు, పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తి అని పేర్కొన్నారు.

రుణాలివ్వాలని సీపీఐ నాయకుల నిరసన

పాన్‌గల్, న్యూస్‌టుడే : మండలంలోని కేతేపల్లి ఎస్బీఐలో రైతులకు రుణాలు ఇవ్వకపోవడంపై బుధవారం గాంధీ జయంతి పురస్కరించుకుని సీపీఐ ఆధ్వర్యంలో బ్యాంకు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ మాట్లాడారు. గ్రామంలో బ్యాంకు ఏర్పాటు చేసి చాలా దశాబ్దాలు పదేళ్లవుతున్నా రైతులకు వ్యవసాయ రుణాలు ఇవ్వడం లేదన్నారు. పాన్‌గల్, వనపర్తి, పెంట్లవెల్లి గ్రామాల రైతులు రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కుర్మయ్య, శివకుమార్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి జిల్లా అథ్లెట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి అండర్-14, 16, 18, 20 బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే మహబూబ్‌నగర్ జిల్లా అథ్లెట్ల ఎంపికలను గురువారం ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ మైదానంలో చేపడుతున్నట్లు సంఘం కార్యదర్శి శరత్‌చంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనన, కుల, ఆధార్ తదితర ప్రమాణపత్రాలతో కోచ్ ఆనంద్ కుమార్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలు ఈనెల 7, 8 తేదీల్లో వరంగల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి సార్వత్రిక విద్య పరీక్షలు

పాలమూరు, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్య (ఓపెన్ స్కూల్) పరీక్షలు ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం, మధ్యాహ్నం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశామని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లా కేంద్రంలోని షాసాబ్‌గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 300 మంది, ప్రభుత్వ గాంధీ రోడ్ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నిబద్ధతతో సేవలందించాలి : డీఐజీ

మహబూబ్‌నగర్ నేరవిభాగం : పోలీసులు ప్రజలకు నిబద్ధతతో సేవలందించాలని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సూచించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జోగులాంబ జోన్ డీఐజీ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ గాంధీజీ సత్యం, అహింసా అనే రెండు ప్రధాన సూత్రాలతో జీవనం సాగించారని గుర్తుచేశారు. గాంధీజీ స్ఫూర్తితో పోలీస్ వ్యవస్థలో విలువలు పాటించాలన్నారు. నిత్యం అనేక మంది బాధితులు ఠాణాలకు వస్తున్నారని, వారితో మర్యాదగా మాట్లాడి సమస్యల పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. జానకి, అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ డి.జానకి తదితరులు

నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం

అమరచింత, న్యూస్‌టుడే : దసరా పండగ పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో దేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు పట్టణంలో నిర్వాహకులు మండపాలను సిద్ధం చేసుకుంటున్నారు. రాజీవ్ గాంధీ కూడలి, శివాజీనగర్, జగన్‌వాడ, విద్యానగర్, బీసీ కాలనీలో దుర్గమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, ప్రత్యేక కార్యక్రమాలతో పాటు బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి రంగనాథాలయంలో

శ్రీరంగాపురం : శ్రీరంగాపురంలోని రంగనాథాలయంలో గురువారం నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ పర్యవేక్షకుడు మహేశ్ తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమం ఉంటుందన్నారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. రోజూ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

భవానీ ఆలయంలో..

కొత్తకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని స్వయంభూ భవానీ ఆలయంలో గురువారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలతో మొదలయ్యే ఈ ఉత్సవంలో 11 గంటలకు కుంకుమార్చనతో అమ్మవారి నివేదన ఉంటుందని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు.



అమరచింత : రాజీవ్ కూడలిలో సిద్ధం చేస్తున్న మండపం

సైబర్ నేరాలతో అప్రమత్తత అవసరం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఏఎస్ఐ రోషన్న పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం వద్ద బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు కోరిన సందర్భాల్లో బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వొద్దని, చరవాణి ద్వారా వచ్చే సందేశాలకు స్పందించి ఆధార్, క్రెడిట్, ఏటీఎం కార్డుల వివరాలు సమర్పించరాదని సూచించారు. అపరిచితులు, అనుమానితుల సమాచారం ఉంటే నేరుగా పోలీసులకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ, భీమయ్య, జేపీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేవల్లి(గోపాల్‌పేట), న్యూస్‌టుడే : రేవల్లి ప్రయాణ ప్రాంగణం వద్ద బుధవారం ఎస్సై రాము ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. చరవాణులకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి, కొత్త నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లకు, ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



బుద్ధారం గండిఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో పల్లకీసేవ

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండలంలోని బుద్ధారం గండిఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భజనలు, పల్లకీసేవ అనంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ పెంటారావు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు. గోపాల్‌పేటలోని చంద్రగుండమఠంలో అమావాస్య పూజలు చేశారు.

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : శ్రీరంగాపురం సమీపంలో స్వయంభూగా వెలసిన ఆదిబసవేశ్వరునికి అమావాస్య సందర్భంగా బుధవారం భక్తులు అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు.

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : స్థానిక వీరన్న గుట్టపై వెలసిన శ్రీ ఘనలింగేశ్వర, భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అమరచింత, న్యూస్‌టుడే : దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం విశ్వకర్మ సోదరులు కృష్ణానది నుంచి జలాలను తీసుకుని వచ్చి జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి కాళికాలయం వరకు ఊరేగించారు. అమావాస్య పురస్కరించుకుని కాళికామాతకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఖిల్లాగణపురం వీరభద్ర స్వామి ఆలయంలో అన్నదానం

అటకెక్కిన యంత్రాలు.. విజృంభిస్తున్న దోమలు

ఈనాడు పరిశీలన

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : దోమల నివారణకు తెచ్చిన ఫాగింగ్ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని 8గ్రామాల్లో రూ.50 వేలు నుంచి రూ.60 వేలు ఖర్చు చేసి వీటిని కొనుగోలు చేశారు. కొన్ని నెలలుగా మరమతులకు గురికావడంతో వాటిని పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు దోమలు పెరిగాయి. సర్పంచులు లేకపోవడంతో కార్యదర్శులపై నిధుల భారం పెరిగింది. వారు ఫాగింగ్ యంత్రాలపై శ్రద్ధ చూపడం లేదని ఆరోపణ ఉంది. ఈ విషయంపై ఎంపీవో రాజును వివరణ కోరగా.. తెచ్చిన యంత్రాలు కొన్ని నెలలు మాత్రమే పని చేశాయని తెలిపారు. మరమతులు చేయిస్తామన్నారు.



మదనాపురంలో పంచాయతీ భవనంలో ఫాగింగ్ యంత్రం

మదనాపురం : రెండు నెలల నుంచి మదనాపురం మండలంలోని ఆయా గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ యంత్రంచే పిచికారీకి రూ.55 వేలు ఖర్చు చేసినట్లు మండల పరిషత్తు అధికారులు తెలిపారు. మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం 8 గ్రామాల్లో ఫాగింగ్ చేసినట్లు పేర్కొన్నారు. మిలిగిన గ్రామాలతో పాటు మదనాపురం, దుప్పల్లి, అజ్జకొల్లులో ఫాగింగ్ చేయలేదు. ఒకసారి ఫాగింగ్ చేయాలంటే రూ.5 వేలు నుంచి రూ. 6 వేలు వరకు వ్యయం అవుతోందని పంచాయతీ అధికారులు చెబుతున్నారు.



శ్రీరంగాపురంలో అటకెక్కిన యంత్రం

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



బాలరాజు

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలోని జీఎస్ నగర్‌కు చెందిన డి.బాలరాజు (40) చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకుని మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధిత బంధువుల కథనం ప్రకారం.. రెండు రోజుల కిందట చేపల వేటకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వల తీసుకుని వెళ్లారు. పట్టణ శివారులోని బావిలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు వలలో చిక్కుకుని మృతి చెందారు. రెండు రోజుల నుంచి అతని ఆచూకీ కోసం వెతకగా బావిలో మృతదేహం లభ్యమైంది. శవపరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహం తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సురేశ్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం

కొత్తకోట, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని కడుకుంట్లకు చెందిన పానుగంటి రాములు (37) మృతి చెందారని కొత్తకోట ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. కడుకుంట్ల స్టేజీ వద్ద రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టినట్లు అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. జ్వరంతో బాధ పడుతున్న ఆయన చికిత్స నిమిత్తం పెబ్బేరుకు వెళ్లినట్లు భార్య తిరుపతమ్మ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : ఓ మహిళపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్సై జలంధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సవాయిగూడెంలో గత నెల 30వ తేదీన డేగా లక్ష్మీ పొలంలో పని చేస్తుండగా అదే గ్రామానికి చెందిన డేగా విష్ణువర్ధన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి మా పొలంలో ఎందుకు పని చేస్తున్నావని దాడి చేశారని, బుధవారం బాధితురాలిచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైతుబొమ్మ చేయి విరగొట్టిన వ్యక్తులపై..

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: మండలంలోని చందాపూర్‌లోని రైతువేదిక ఎదుట రైతుబొమ్మ చేయిని గుర్తుతెలియని విరగొట్టి తలపై పెట్టారు. బుధవారం మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి శ్రీనివాసులు వేదిక వద్దకు చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పరిశీలించి గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

ఇచ్చిన డబ్బులు అడిగినందుకు దాడి

పాన్‌గల్, న్యూస్‌టుడే : మండలంలోని రేమద్దుల గ్రామానికి చెందిన బాలస్వామి అదే గ్రామానికి చెందిన ఆవుల బుడ్డయ్యకు ఆరునెలల క్రితం రూ.మూడు లక్షలు ఇచ్చారని ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. విడతల వారీగా రూ. 2,75,00 చెల్లించి మిగతాడబ్బు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండగా.. ఈనెల ఒకటో తేదీన ప్రశ్నించడంతో బుడ్డయ్య రాయి విసరడంతో బాలస్వామి తలకు తగిలి తీవ్ర గాయమైందన్నారు. బుధవారం బాధితుడు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్యాస్ స్టౌ వెలిగిస్తుండగా.. తీవ్ర గాయాలు

మదనాపురం, న్యూస్‌టుడే : గ్యాస్ సిలిండర్ స్టౌ వెలిగిస్తుండగా ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని నర్సింగాపురంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలయ్య గౌడ్ మంగళవారం రాత్రి ఇంట్లో టీ వేడి చేసేందుకు గ్యాస్ సిలిండర్ ఆన్ చేసి స్టౌ అంటిస్తుండగా ప్రమాదవశాత్తూ మంటలు చేలరేగి ముఖం పూర్తిగా కాలిపోయింది. ఆయన కేకలు విని చుట్టుపక్కల వారు వచ్చి స్టౌ ఆర్పివేశారు. అనంతరం చికిత్స కోసం 108 వాహనంలో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలి



కొత్తకోట : అమడబాకులలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవీంద్రబాబు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో రవీంద్రబాబు అన్నారు. మండలంలోని అమడబాకులలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఊరచెరువు కట్టపై ప్రమాదకరంగా ఉన్న స్తంభాలపై గత నెల 30న ‘ఈనాడు’ ప్రచురితమైన చిత్ర కథనంపై గ్రామసభలో చర్చించారు. కొత్త స్తంభాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేశ్, మాజీ సర్పంచి బుచ్చన్న, క్షేత్ర సహాయకురాలు లలిత, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

మదనాపురం, న్యూస్‌టుడే : మదనాపురంతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేశారు.

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : శ్రీరంగాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామి పనుల నిర్వహణ కోసం కార్యదర్శి నందకిశోర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో రవినారాయణ, ఎంపీవో రాజు అతిథులుగా హాజరయ్యారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పాన్‌గల్, న్యూస్‌టుడే : ప్రతి గ్రామంలో క్షేత్ర స్థాయికి వెళ్లి ఉపాధి హామీ పనులు గుర్తించాలని ఎంపీడీవో గోవిందరావు అన్నారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో బుధవారం 2025-26 సంవత్సరానికి ఉపాధి పనుల గుర్తింపుపై సభలు నిర్వహించారు. తెల్లరాళ్లపల్లిలో నిర్వహించిన సభలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీవో రఘురాములు, ఏపీవో కుర్మయ్య, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.



దుప్పల్లిలో గ్రామసభ నిర్వహణ